కథానిక

# కలహంలో వసంత

కె. రామలక్ష్మి

"సినిమాకా? బీచికా?"

"చాలా రోజులయిందిగా. బీచికి వెడదాం."

"నడిచా? వాహనంలోనా?"

"దగ్గరేగా. నడిచే వెడదాం."

"అయితే త్వరగా తెములు పార్వతీ," అంటూ కుర్చీలో జేరబడ్డాడు కృష్ణమూర్తి. నిజానికి కృష్ణమూర్తికి ఆరోజు సినిమాకి వెళ్ళాలనివుంది. నడవడానికి బద్ధకంగావుంది. అయినా పార్వతి అలా అందికదా అని తెములమన్నాడు.

"అయితే నువ్వు తెమలక్కరలేదేమిటి?" అతని కుర్చీ చేతిమీద కుర్చుంటూ పార్వతి అడిగింది.

"నేనిలా వస్తానులే. నువ్వు రడీ అవు. అప్పుడే ఆరవస్తూంది." అంటూనే పార్వతి నడుముచుట్టూ చెయ్యివేశాడు. అతని తలమీద తన చంప ఆనించి పార్వతి ఓక్షణం యీ లోకం మరిచింది.

"పోనీ ఎలాగా లేటయింది కనుక యింట్లోనే వుండిపోదామా?"

"నువ్వెప్పుడూ యింతే నా కెక్కడికేనా వెళ్ళాలని వున్నరోజు యిలాగే చేస్తావు." పార్వతి స్వరం మారిపోతూంది. కృష్ణమూర్తి నవ్వుకున్నాడు. ఎన్నాళ్ళకీ యీ పార్వతి పెద్దదవదనుకున్నాడు. "లేపారూ, పోదాం నడు."

పార్వతి కిటికీలూ తలుపులూ మూసింది. లైట్లార్పింది. వంటింట్లో నూకాలుతో చెప్పింది. వీధిలో రోడ్డుమధ్యగా నిల్చుని సిగెరెట్టు కాల్చేస్తూన్న కృష్ణమూర్తిని సమీపించింది. మారుమాట లేకుండానే యిద్దరూ నడుస్తున్నారు. ఈ నిశ్శబ్దం పార్వతికి భరింపరానిదిగా వుంది...

"అంత అయిష్టంగా రాకుంటే యింటిదగ్గిరే చెప్పకూడదూ? ఇంటిదగ్గిర నూకాలేనా వుండీ."

అదన్నమాట! తనతో మౌనంగావుంటూ నడిచే కంటే నూకాలుతో బాతాకానీ కొట్టడం బాగుంటుందన్నమాట పార్వతికి! ఈ ఆలోచన కృష్ణమూర్తిని కొంచం బాధపెట్టింది. కొన్ని వందల మంది ఆడపిల్లల మధ్యనుంచి ఏరీ కోరీ పార్వతిని చేసుకున్నాడు...

"అయితే పార్వతీ నూకాలు కంపెనీయే నీకు బాగుంటుందా?" నవ్వుతూ అడిగాడు.

"అవును. నీ ఆవదం ముఖంకంటే అదే నయం" కటువుగా సమాధానం చెప్పినపార్వతి ముఖంలోకి క్షణం చూశాడు కృష్ణమూర్తి.

"అయితే నడుపోదాం" అన్నాడు కృష్ణమూర్తి. పార్వతి క్షణంలో గ్రహించింది అతనిలో వచ్చిన మార్పు.

"అదికాదు కృష్ణా, నువ్వలా వుంటే ఎలా చెప్పు?సరదాగా బీచికివెళ్ళాలిగాని, ఎందుకొచ్చిందా అని వెళ్ళడం ఎందుకూ అని...అంతేకాని," ఇంకా చెప్పబోయింది కాని మధ్యలోనే ఆపేశాడు కృష్ణమూర్తి: "నాక్కొంచం తలనెప్పిగా వుంది. అందుకే అలా వున్నాను. క్షమించు పార్వతీ," అన్నాడు ప్రాధేయపడుతున్నట్లు ధ్వనించే గొంతుకతో. అదంతా ఉత్తినటన! అది పార్వతి ఉద్దేశంకాని, ప్రస్తుతానికి నిజమనేనమ్మి "ఇంటిదగ్గిరే చెప్పకపోయావా తుండూ, ఎనాసిన్ వేసేదాన్ని." ఆప్యాయంగా కృష్ణమూర్తి చేతిని తన చేతులోకి తీసుకుంది పార్వతి. 'ఇది రోడ్డు అయినా ఫరవాలేదులే,' అన్నట్లు చిలిపికళ్ళతో చూశాడు కృష్ణమూర్తి.

ఇలా యిసుగలో అడుగు పెట్టబోతూంటే, ఊరెగిరి పోయేలాంటి కేక వినిపించింది. పార్వతి తన చేయి తీసేసుకొని దూరంగా జరిగింది. కృష్ణమూర్తి వెనక్కి చూశాడు. "వసంతా వాళ్లూను పార్వతీ, అక్కడికిపోయి కూర్చుందామా?" అంటూ పార్వతి జవాబు కోసం చూడకుండానే అటు మళ్ళేడు కృష్ణమూర్తి. పార్వతికి అతన్ననుసరించక తప్పలేదు.

వసంతపక్కనే చతికిలబడుతూ "ఎం కేక వేశావు వసంతా! మా పార్వతి ఉలిక్కిపడిందంటే

నమ్మి. కదూపారూ" ప్రేమతో అన్నాడు కృష్ణమూర్తి. పార్వతి లోపల్లోపల అగ్నిపర్వతాలు బద్దలవుతున్నాయి. హాయిగా బీచిలో కూర్చుందామని వస్తే యిక్కడో గెంగు తయారయింది; ఏం చెయ్యలేక అర్థంలేని చిరునవ్వు నవ్వింది పార్వతి.

"అంతట్లోకే ఉలికిపడే రకం కాదబ్బాయి నీ భార్యామణి!" కృష్ణమూర్తి పర్సులోంచి అర్థరూపాయి తీస్తూ అంది వసంత.

"పర్సు ఖాళీ చేసేయకు వసూ. సెలాఖరు."

"అయ్యగారికి సెలాఖరు భయంఎప్పట్నుంచీ" అంటూ కొంటెగా పార్వతి కేసిచూసింది వసంత.

వసంత వసంతం లాగే నాజూకుగా సంతోషంగా చెలాకీగా వుంటుంది. పార్వతికి పూర్వం వసంతతో కొంచం పరిచయంవుంది. కాని అదంత చెప్పుకోతగ్గదికాదు. కాని, యీ వసంతకీ కృష్ణమూర్తికీ యింతటి స్నేహంవుందని పార్వతికి యిప్పుడే తెలుసు. ఈ 'నిజం' పార్వతి హృదయంలో ఎన్నెన్నో అర్థంకాని వూహాలని రేకెత్తించింది. ఇంట్లో అనేకసార్లు వింది: మాటల సందర్భంలో వసంత గొడవ. ఓరోజు కృష్ణమూర్తి అన్నాడు కూడా: వసంతే అయితేనా అని. పార్వతిది విశాలహృదయమే. కాని దాన్లో అక్కడక్కడ చీకటి కోణాలుండిపోయి, ఇలాంటప్పుడు బాధపెడుతూ వుంటాయి. తన ఆలోచనలలో మునిగిపోయి పార్వతి ఎక్కడవున్నదీ కూడా మరిచిపోయింది.

"అలావున్నావేం పార్వతీ? వసంత వేరుసెనగలు కొంది—తీసుకో" అంటూ కృష్ణమూర్తి పిలిచేదాకా, తాను నలుగురిలో కూర్చున్నసంగతి జ్ఞాపకం రాలేదు.

"ఏంలేదు కృష్ణా, తలనొప్పిగావుంది!" కొంచం వ్యంగ్యంగా అనకుండా వుండలేక పోయింది పార్వతి.

"ఎవరికీ" ఆశ్చర్యంగా అడిగింది వసంత.

"అదో ప్రయివేట్ జోక్ లే. వస్తూన్నప్పుడు తలనొప్పిగా వుందన్నాను. అదేయిప్పుడు పార్వతి చెప్తోంది. నీ కేకతోనా తలనొప్పి కాస్తా పోయింది వసూ,—అవునుకాని అన్నయ్య ఎప్పుడొస్తాడు? నీ ఫ్రెండు మీన ఏమయింది? ఇద్దరూ కలిసి యిదివరకు నన్నూ జగ్గాయినీ ఏడిపించినట్లు అబ్బాయిల ప్రాణాలు తీస్తున్నారా? ... కృష్ణమూర్తి ధారావాహినిగా వేస్తూన్న ప్రశ్నలు... నిద్రలో విన్పిస్తూన్నట్లుగావుంది పార్వతికి. అయితే యీ వసంత కృష్ణమూర్తి అబ్బాయిని ఏడిపించినట్లు ఏడిపించేదన్నమాట! పెళ్ళికాని క్రితం, తన యింటికి అన్నయ్య స్నేహితుడిగా కృష్ణమూర్తి వచ్చేరోజులు జ్ఞాపకం వచ్చాయి పార్వతికి. ఎప్పుడూ ఎవరో ఓ అమ్మాయి గొడవే! ఫలానా అమ్మాయికి అలాంటి చీర బాగుంటుంది దగ్గర నుంచి, ఆ అమ్మాయి రాసిన ఉత్తరంలో సంగతుల దాకా... ఏమేమిటో చెప్పుకొనేవారు. అయితే, నన్నేడిపించడానికి కాకపోతే ఎందుకు పెళ్ళి చేసుకున్నట్లు?... పెళ్ళయిన కొత్తలో ఒకసారి కృష్ణమూర్తి రాసినఉత్తరం జ్ఞాపకం వచ్చింది పార్వతికి 'యిక్కడ నువ్వులేక పోవడం లోటుగానేవుంది కాని ఆ లోటు చాలామటుకు మా స్నేహం తీరుస్తూంది. వసంత ఎంత చలాకీ పిల్ల అనుకున్నావు? ఎప్పుడూ నవ్వుతూ వుంటుంది. చదరంగంలో తప్పుటెత్తువేస్తే చెవిమేలేస్తుంది. ఏమో, నువ్వొచ్చేసరికి యీ కుడిచెవి వినుగ చెవిలా అవుతుందని భయంగావుంది...'అంటూ ఏమేమిటో రాశాడు. అంతా వసంత గొడవే. తనకంతటి చక్కటి స్నేహితురాలుంటే నన్నెందుకు చేసుకున్నాడు?...ఏమైనా సరే యింటికి వెళ్ళగానే అడగాలని నిశ్చయించుకుంది. వసంతా కృష్ణమూర్తీ కలుసుకొని ఏళ్ళూపూళ్ళూ అయినట్లు, మళ్ళీ ఎంత కాలానికో కాని కలుసుకోమేమో అన్నట్లు తెగ మాట్లాడేసుకుంటున్నారు. పార్వతి అప్పటిదాకా సముద్రంకేసీ, అప్పుడే ఉదయిస్తూన్న చంద్రుడు కేసీ చూస్తూంది, నిజం తెలుసుకోవాలన్న ఆత్రుత ఆమెని రెస్టులెస్ గా చేసింది. అందుకే "యింక లేద్దామా కృష్ణమూర్తీ?" అంది. ఈ సంబోధనకి వసంత నవ్వింది. పార్వతి ముఖం కోపంతో (!) ఎర్రపడింది.

"కృష్ణమూర్తి పేరువింటే మీరు మైమరచేటట్టున్నారే!" వ్యంగ్యంగా అంది పార్వతి. కృష్ణమూర్తి ఆశ్చర్యంగా చూశాడు. వసంత సమాధానంచెప్పింది: "అవునండీ మిసెస్ కృష్ణమూర్తీ! అతనలా తయారు చేశాడు నన్ను! అతను లేకుంటే ఎలాగా అనుకునే దాన్ని." నోర్మూయి అందామనుకుంది పార్వతి.

అప్పట్లో అడ్డొచ్చిన సంస్కారాన్ని తిట్టుకుంది. తనూ పాకల్లో అప్పమ్మలా ధైర్యంగా అనేయ కల్గితే! ఎంత మనశ్శాంతి!...పార్వతి సమాధానంగా చిరునవ్వునవ్వింది.

"పోతాం వసంతా, పార్వతికి తలనొప్పి!" అన్నాడు కృష్ణమూర్తి వసంత చేయి తన చేతిలోకి తీసుకుంటూ. "మంచి దబ్బాయి. నే చెప్పిన ఉత్తరం వ్రాస్తావు కదూ!" అంటూ పార్వతి కేసి తిరిగి "వెళ్ళొస్తానండీ, మా యింటికోసారి మీ ఆయనతో రండి" అంటూనే తిరిగి కృష్ణమూర్తితో "తప్పకుండా వుత్తరం రాయగానే వస్తావుకదూ? రాకుంటేనా!" అంటూ వెనక్కి తిరిగి వెళ్ళింది వసంత. వసంతతో పాపం! యింకో యిద్దరమ్మాయిలు వచ్చారు. వాళ్లూ నవ్వుకుంటూ లేచారు. కృష్ణమూర్తిని చూచినదగ్గరనుంచీ వాళ్ళతో ఒక్కమాటేనా ఆడలేదు వసంత. ఆస లూపిరి సలపనిస్తేనా ఎవరికేనా?

దారంట నడుస్తూ వూరుకోలేక, "మంచి స్నేహితురాలే వుందే! చెప్పావుకావేం?"

"నీకూ తెలుసుగా. చెప్పేదేమిటి?"

"నాకు తెలిసింది చాలా కొంచంలే" నవ్వుకుంటూ అంది పార్వతి. కృష్ణమూర్తికి తెలుసు పార్వతి ఎంత ఉడుకుబోతుదో. కృష్ణమూర్తికి తెలుసు పార్వతికి ఎంత యీర్ష్య వుందో! అందుకే "అవును పార్వతీ, నేను మీ అన్నయ్యకి మాట ఇచ్చివుండకపోతే వసంతనే పెండ్లాడి వుందును" అన్నాడుఏడిపిద్దామని. ఓ క్షణం వూరుకొనివుంటే పార్వతి రోడ్డుమీదే ఏడ్చేసేది. "నీవన్నీ పిచ్చి వూహాలు పార్వతీ. వసంత చిన్నపిల్ల. దానికింకా చిన్నతనపు చేష్టలు పోలేదంటే బాగానే వుంది. నువ్వు కూడా అలా ప్రవర్తిస్తే!"

"నే నెలా ప్రవర్తించినా నీకు అసహ్యంగానే వుంటుందిలే" కోపంగా అంది పార్వతి.

ఇక మాటల్లేకుండానే యిల్లు చేరారు. ఈ చిన్న తుంపరలు రాత్రికి గాలివాన గాక తప్పదని ఎప్పుడో తెలుసు కృష్ణమూర్తికి. అందుకే తను ఏం మాట్లాడకుండా భోజనం కానిచ్చి వాలు కుర్చీలో పడుకుని సిగరెట్టు ముట్టించాడు. కృష్ణమూర్తికి అనేక వూహాలు రాసాగాయి. తనతో చనువుగా వసంత ప్రవర్తిస్తే పార్వతికి అంత కష్టం ఎందుకుకల్గాలి? దీనికి ఎంత ఆలోచించినా సమాధానం దొరకలేదు. చివరకి, పార్వతి ఒక్క ఆడపిల్ల అన్న ప్రాతిపదికమీద ఆలోచన సాగిస్తే- యిట్టే సమాధానం దొరికింది. యీ ఆడపిల్లలకి అర్థమయేటట్టు ఏదీ చెప్పలేం. వాళ్ళ వూహాలే వాళ్ళవి. అంతే. అబ్బాయి అమ్మాయిని ప్రేమించనిదే మాట్లాడలేడని! ఎంత సంకుచితం వీళ్ళ మెదడు! ఆలోచించినకొలదీ కృష్ణమూర్తికి పార్వతి మీదకోపం కంటె జాలెక్కువయింది. పాపం పార్వతిమటుకు ఏంచేస్తుంది? అనుకున్నాడు.

భోజనం ముగించి గదిలోకి వెళ్లి పడుకుందన్న మాటేగాని పార్వతికి నిద్రరాలేదు. హాయిగా కాలం గడిచిపోతూంటే మధ్యని యీ వసంత ఎవరు? నాకీసంగతి తెలియకపోయినా బాగుండునే! అనుకుంది. అన్నయ్యకి ప్రామిస్ చేయకుండా వుంటే వసంతని వివాహం ఆడేవాడా? తనొప్పుకోకపోతే అలాగే వుండిపోయుండేవాడిని అని చెప్పే కృష్ణమూర్తేనా యిలాఅంటే? పార్వతికి దుఃఖం పొంగిపొరలి వచ్చింది. తలగడలో తల దూర్చి ఎంతసేపు ఏడ్చిందో! ఎంతసేపయి నిద్ర పోయిందో! కళ్లు తెరిచేసరికి కృష్ణమూర్తి పక్కని కూర్చుని తలనిమురుతున్నాడు. కృష్ణమూర్తిని చూసేసరికి పోయిన దుఃఖం మళ్ళీవచ్చింది.

"అలా ఏడుస్తావేమిటి పారూ! చిన్నపాపలాగా!" సముదాయించాడు కృష్ణమూర్తి.

"నేనోసంగతి అడుగుతాను. నిజం చెప్తావా!" దుఃఖంతో పూడుకుపోయిన గొంతుకతోనే అడిగింది పార్వతి.

"అడుగు పార్వతీ. ఇప్పటిదాకా నీకెప్పుడూ నే నబద్ధం చెప్పలేదు. చెప్పనుకూడా" పార్వతిని తన చేతుల్లోకి తీసుకుంటూ అన్నాడు.

"అయితే నువ్వు సాయంత్రం అన్నదినిజమేనా?"

"ఏమిటీ... ఓ అదా...నువ్వొట్టి పిచ్చిదానివి పార్వతీ, నువ్వులేకుంటే నా జీవితం ఎంతో బీడులాగడిచేది. నీకోసం ఎన్నియుగాలు తపస్సు చేసాను? నీకు కోపవస్తే నేనెన్నిసార్లు ఒణికిపోలేదు!" ఏమంటావు పార్వతీ అన్నట్లు - కవిగారి గొంతుకలో పద్యంలాగా - చదివేస్తున్నాడు కృష్ణమూర్తి. ఆ సందట్లో పార్వతి కళ్ళు నవ్వడం చూడలేదు కృష్ణమూర్తి.

"అయితే ఎలాగా తప్పదని నన్ను పెళ్ళాడ లేదన్నమాట?" సమాధానంకోసం ఆత్రంగా ఎదురు చూస్తూ అడిగింది.

సమాధానంగా పార్వతిని కౌగలించుకొన్నాడు కృష్ణమూర్తి. అయినా పార్వతిలో కొన్ని అను మానాలు బుసకొడుతూనే ఉన్నాయి! "నువ్వెడితే వెళ్ళాళ్ళవుగాని, నన్నక్కడికి రమ్మనకు కృష్ణా. నువ్వెళ్ళినా నాకు చెప్పకు." అంది అతని బుజం మీద తల ఆన్చుతూ.

"చెప్పకపోతే ఎలా?" అనేసి నాలిక్కొరుక్కు న్నాడు కృష్ణమూర్తి. "చెప్పకపోవడం ఎందు కొచ్చింది కాని . నే వెళ్ళను పార్వతీ. నీకు కష్టం కల్గించేది నే చేయను" అన్నాడు. పార్వతిముఖం చూడగానే అనుకున్నాడు కృష్ణమూర్తి: పార్వతి మనస్సు ప్రశాంతంగా వుందని. "సాయంత్రం నన్నెంత నొప్పించావో తెలుసా?" "శిక్ష యిద్దరం అనుభవించేశాం. ఇక మరిచిపో పార్వతీ. టైమెం తయిందో తెలుసా? రెండున్నరా!" టైము చెప్పే సరికి పార్వతి కళ్ళు నిద్రభారంతో మూతలు పడ్డాయి. ఏడవడంవల్ల ఉబ్బిన పార్వతి కను రెప్పలు చూస్తే కృష్ణమూర్తికి ఆశ్చర్యం వేసి అనుకున్నాడు· ఇంతగా ప్రేమిస్తూందా యీ పిచ్చి పార్వతి! అని.

---

విచిత్ర ప్రపంచంలో

# ప్రేమోదయాలు

"ప్రభు"

ఎన్నివిధాల చర్చించుకున్నా, తరిగిపోని విష యాల్లో చాలారమ్యమైంది ప్రేమ. ప్రేమ లేకపోతే ఈనాడు సగంపత్రికలూ, ముప్పాతిక సినిమాలూ, ఎన్నో ట్యుటోరియల్ కాలేజీలూ ఎగిరిపోతాయ్. ప్రేమమయమైన ఈ జీవనంలో సర్వకాల సర్వావస్థలలోనూ ప్రేమ ఉదయిస్తూ ఉంటుంది ఎక్కడో ఓ దగ్గర —— అయితే, ఈ ప్రేమోదయం చాలా మధురమైన విషయం కనక, చర్చనీయం అవుతుంది.

ఆ మధ్య ఓ ఇంగ్లీషు పత్రికలో ఒక వార్తా భాగం ఈ ప్రశ్నతో ప్రారంభించారు— "నవ్వుతో ప్రేమలో పడగలరా?" అని. నిజంగానే, ఇంగ్లీష్ తార జేన్‌పాల్ విషయంలో అలాగజరిగిందని వెల్లడిచేసిందా పత్రిక.

ఆ నటి ఒక బాల్ రూమ్‌లో కూర్చుని స్నేహితు రాలితో సరససల్లాపాలు ఆడుతూఉంటే ప్రక్కన ఎవరో యువకుడినవ్వు కిలకిలమంటూ వినిపించిం దిట. అతను అవతలిగదిలో ఉండడాన్న ఆమెకి కనపడలేదుట. అయినా జేన్ వెంటనే, "అంత చక్కగా నవ్వగలిగినవాణ్ణి పెళ్ళిచేసుకుంటాను" అని ప్రకటించిందిట.

ఆ నవ్వు ఎడ్వర్డ్ అనే యువకుడిది—వాళ్ళిద్దరికీ పరిచయం జరిగిందిట. పెద్దలందరూ కాదన్నా వివాహం యథావిధిగా జరిగిపోయింది...

ఇది ఉదాహరణ ప్రేమోదయానికి.

ఆంగ్ల రచయితలలో అపూర్వఖ్యాతి గడించిన ఛార్లెస్ డికెన్స్ రచనలు ప్రపంచాన్ని ఎంత ఉర్రూతలూగించాయో, ఆయన జీవితంలో ఒక ప్రణయమూ అంత సంచలనం కలిగించింది. ఎలెన్ టిర్నన్ అనే చక్కటి అమ్మాయి ఆయన నాటకంలో వేషంవేస్తూ, కారణాలవల్ల తనగదిలో వెక్కివెక్కి ఏడుస్తూ కూర్చుందిట. కాటుక కళ్ళ నీటిబలం చెప్పేదేమిటి? డికెన్స్‌గారి మనసులో అమాతంగా ప్రేమోదయం అయిపోయి, తరవాత ఆయన జీవితాంతమూ జరిగిన ప్రణయం ప్రళయ మంత అల్లరిచేసింది.

ఇలాగ ప్రేమోదయం అయి, జీవితాలు మధుర సంగీతాలు ఎన్నో ఉన్నాయి. జేన్ మని షిని చూడకుండాకే ప్రేమలో పడ్డది. డికెన్స్ దుఃఖపూరితమైన ఎలెన్ వదనంచూసి, కరిగిపోయి ప్రేమలోకి జారిపోయాడు. జేన్ విషయంలో Love at first sight (తొలి చూపులోనే